aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610



నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
గురువారం
19-03-2026 సంపుటి : 01 సంచిక : 8 పేజీలు : 08 వెల : ₹5/-
ప్రజలతో...మహాప్రభ

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ ANNUAL mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## "మమ్మల్ని ప్రేమించి.. మోదీని పెళ్లి చేసుకున్నారు"

- దేవెగౌడపై ఖర్గే హాస్య విసుర్లు!
- రాజ్యసభలో ఖర్గే చలోక్తులు.. నవ్వు ఆపుకోలేకపోయిన ప్రధాని మోదీ!
- డేటింగ్ మాది.. పెళ్లి మోదీతో: దేవెగౌడ రాజకీయ ప్రస్థానంపై ఖర్గే సెటైర్లు.
- రాజ్యసభ వీడ్కోలు ప్రసంగంలో ఖర్గే 'లవ్ స్టోరీ' పంచ్‌లు!




న్యూఢిల్లీ మార్చి 18( మహాప్రభ

ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే రాజ్యసభలో నవ్వులు పూయించారు. రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్న నేపథ్యంలో.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సభలో జరిగిన అంశాలను ప్రస్తావించారు. తన రాజకీయ జర్నీ గురించి కొంత వివరించారు. ప్రస్తుత కాలపరిమితి ముగియడంతో.. మాజీ ప్రధాని దేవగౌడ, ఎన్సీపీ నేత శరద్ పవార్ కూడా వీడ్కోలు తీసుకుంటున్నారు.

-మిగతా 3 లో

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

- రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!
- పార్లమెంట్ ఒక 'ఓపెన్ యూనివర్సిటీ': రిటైర్ అవుతున్న ఎంపీలకు ప్రధాని సందేశం.
- ఖర్గే, దేవెగౌడ, పవార్ 'రాజకీయ మహాయోధులు': రాజ్యసభలో మోదీ ప్రశంసల జల్లు.
- సభ మారినా సేవ ఆగకూడదు
- 59 మంది సభ్యులకు ప్రధాని మోదీ ఘన వీడ్కోలు.



న్యూఢిల్లీ:మార్చి 18( మహాప్రభ

రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ

-మిగతా 3 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

### ఉగాది శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం పత్రిక వెలువడదు

పునర్దర్శనం శనివారం

మహాప్రభ




## విజన్‌తో ముందుకెళ్తాం

### ప్రతిపక్ష నేతగా సభకు రండి కేసీఆర్


- ఒక్కోమెట్టు ఎక్కుతూ సీఎం అయ్యా...
- 2029లోనూ మాదే అధికారం
- నాలుగు కోట్ల ప్రజల ప్రయోజనమే మా ధ్యేయం
- గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరం
- పంటమార్పిడిపై అన్నదాతలను చైతన్యపరుస్తాం
- ఆర్గానిక్ ఫుడ్, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం : శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి
- శుక్రవారానికి శాసనసభ వాయిదా

హైదరాబాద్ మార్చి 18( మహాప్రభ

ఎవరు కలిసొచ్చినా.. కలిసిరాకపోయినా 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించి దానికనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వానికి విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. విజన్‌తో కూడిన గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరమన్నారు. పెద్దాయన పార్టీ బాధ్యతలు అప్పగించిపోతే వాళ్లిద్దరూ(కేటీఆర్, హరీశ్‌రావు) చింపిన ఇస్తరాకు మాదిరిగా మారుస్తున్నారని విమర్శించారు. తాను క్షేత్రస్థాయి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుకుంటూ రాజకీయనేతగా

-మిగతా 3 లో






## ఇరాన్‌పై అమెరికా భారీ యాక్షన్

- హార్మోజ్ కోసం బంకర్ బస్టర్ల దాడి
- హర్మూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య
- 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం
- అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్

వాషంగ్టన్ మార్చి 18( మహాప్రభ

హార్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హార్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది.

-మిగతా 3 లో

## రాష్ట్రాలకు అదనంగా మరో పదిశాతం ఎల్‌పీజీ

- తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

3 లో



## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి

3 లో



## మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం

### మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ



- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోను అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కేటీఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్ మార్చి 18( మహాప్రభ

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో

-మిగతా 3 లో




## ముఖ్యమంత్రి పదవి ఆఫర్.. అయినా సరే నో చెప్పిన విజయ్!

- ఢిల్లీ ముందు తలవంచే ప్రసక్తే లేదు: స్పష్టం చేసిన టీవీకే నేత అధవ్ అర్జున.
- మొదట 50.. ఆపై సగం సీట్లు ఇస్తామన్నా దక్కని దళపతి మద్దతు!
- ఏప్రిల్ 23న తమిళ సమరం: పెరంబూర్ నుంచి బరిలోకి విజయ్?
- ఒంటరి పోరుకే మొగ్గు: బీజేపీ, కాంగ్రెస్ ప్రతిపాదనలను తోసిపుచ్చిన టీవీకే.

న్యూఢిల్లీ: మార్చి 18( మహాప్రభ

టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని టీవీకే నేత అధవ్ అర్జున అన్నారు. అయితే, అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. అయితే, ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు అర్జున తెలిపారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా.. రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు.అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం. ఇటీవల పలు సందర్భ?ల్లో కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుక సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్

-మిగతా 3 లో



## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

- నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్
- 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 18( మహాప్రభ

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు

-మిగతా 3 లో

# మొజ్తాబా ఖమేనీని వెతికిపట్టుకుని అంతం చేస్తాం



**న్యూఢిల్లీ మార్చి 18( మహాప్రభ**
ఇరాన్ నూతన సుప్రీం లీడర్ అయతుల్లా మొజ్తాబా ఖమేనీ ని ఎక్కడ ఉన్నా వెతికి పట్టుకుని అంతం చేస్తామని ఇజ్రాయెల్ గట్టి హెచ్చరిక చేసింది. తమ దేశానికి ముప్పుగా ఉన్నవాళ్లు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని పేర్కొన్నది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమవద్ద సమాచారం లేదని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పింది.మొజ్తాబా ఎక్కడున్నారన్న దానిపై మావద్ద ప్రస్తుతం సమాచారం లేదని, కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపమని ఇరాన్ రక్షణ దళాల ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ అన్నారు. తమకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు తమ నుంచి తప్పించుకోలేరని, వారిని తరిమి తరిమి అంతం చేస్తామని వ్యాఖ్యానించారు. ఎప్పుడు, ఎక్కడ అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పలేకపోయినా తమ టార్గెట్ మాత్రం మిస్ కాదని డెఫ్రిన్ వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే అమెరికా, ఇజ్రాయెల్ బలగాల దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించినట్లు వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. ఇదొక కొత్తతరహా మానసిక యుద్ధమని, ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, దాక్కోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారని ఇరాన్ ధ్రువీకరించింది.

# గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపు..




**గాంధీనగర్: మార్చి 18( మహాప్రభ**
గుజరాత్ అసెంబ్లీ కి బుధవారం బాంబు బెదిరింపు వచ్చింది. ఈ మెయిల్ ద్వారా ఆ బెదిరింపు చేశారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. అయితే బుదవారం సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే ఈ మెయిల్ వచ్చినట్లు తెలిసింది. అంసెబ్లీ కాంప్లెక్స్‌లో బాంబును అమర్చినట్లు బెదిరింపులో పేర్కొన్నారు. దీంతో అసెంబ్లీ లో ఉన్న సిబ్బంది, ఎమ్మెల్యేలను పరిసర ప్రాంతం నుంచి ఖాళీ చేయించారు. డిప్యూటీ ఎస్పీ పీయూష్ వందా ఈ విషయాన్ని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నది. కానీ ఉదయం 8.45 నిమిషాలకు బాంబు బెదిరింపు మెసేజ్ వచ్చిందన్నారు. బాంబు బెదిరింపు సమాచారం రావడంతో.. పోలీసులు అసెంబ్లీకి వచ్చి పేలుడు పదార్థాల కోసం సోదాలు మొదలుపెట్టారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి అనుమానిత వస్తువును గుర్తించలేదన్నారు.

# బెంగాల్‌లో 13మంది ఐఎఎస్‌ల బదిలీ




**కోల్‌కతా : మార్చి 18( మహాప్రభ**
అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల సంఘం (ఇసి) బుధవారం 13 మంది ఐఎఎస్‌లను బదిలీ చేసింది. పలువురు జిల్లా మెజిస్ట్రేట్‌లు (డిఎం)లను నియమించడంతో పాటు, వారిని జిల్లా ఎన్నికల అధికారులుగా (డిఇఒ)కూడా నియమించి, ఎన్నికల పరిశీలకులుగా కీలక బాధ్యతలను అప్పగించాలని ఆదేశించింది. జితిన్‌యాదవ్ (కూచ్ బెహార్), సందీప్ ఘోష్ (జల్పాయి గరి), వివేక్ కుమార్ (ఉత్తర దినాజ్‌పూర్), రాజన్వీర్ సింగ్ కపూర్ (మాల్దా) మరియు ఆర్.అర్జున్ (ముర్షిదాబాద్) సహా పలువురు అధికారులను జిల్లా మెజిస్ట్రేట్ కమ్ డిస్ట్రిక్ పోల్ ఆఫీసర్స్‌గా నియమించినట్లు ఇసి తెలిపింది. స్మితా పాండే కోల్‌కతా మునిసిపల్ కార్పోరేషన్ కమిషనర్‌గా, కోల్‌కతా నార్త్ డిఇఒగా నియమితులవగా, రణధీర్ కుమార్ కోల్‌కతా సౌత్ డిఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు బదిలీ అయిన అధికారులను ఎన్నికలకు సంబంధించిన ఏ విధుల్లోనూ నియమించకూడదని ఇసి ఆదేశించింది.

# ఈడీ దాడులు జరుగుతుంటే అడ్డుకుంటారా..

## మమతా బెనర్జీపై సుప్రీం కోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ మార్చి 18( మహాప్రభ**
పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై భారత సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకవైపు ఈడీ దాడులు జరుగుతుంటే, అక్కడికి దూసుకెళ్లి, దాడుల్ని అడ్డుకుంటారా అంటూ మండిపడింది. ఐప్యాక్ ఆఫీసు, ఆ సంస్థ చీఫ్ ఇంటిపై ఈడీ దాడుల సందర్భంగా మమతా బెనర్జీ అడ్డు తగిలిన సంగతి తెలిసిందే. దీనిపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు తాజాగా స్పందించింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియా ఆధ్వర్యంలోని బెంచ్ కీలక ఆగ్రహం వ్యక్తం చేసింది.గత జనవరి 8న పశ్చిమ బెంగాల్, కోల్‌కతాలో ఐ ప్యాక్ సంస్థ ఆఫీసులపై, ఆ సంస్థ చీఫ్ ప్రతీక్ జైన్ ఇంటిపై ఈడీ దాడులు చేసింది. ఒక మనీ లాండరింగ్ కేసుపై విచారణలో భాగంగా ఈ దాడులు చేసింది. అయితే, ఈ దాడుల సందర్భంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హైడ్రామా నడిపారు. దాడులు జరుగుతున్న ఐ ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లి ఈడీ కార్యకలాపాలకు అడ్డు తగిలారు. అంతేకాదు.. ప్రతీక్ జైన్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, ఇంకొన్ని కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారు. అక్కడ్నుంచి ఐప్యాక్ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ కూడా ఈడీ దాడుల్ని అడ్డుకుని, ఇంకొన్ని డాక్యుమెంట్లు తీసుకుని మమత వెళ్లిపోయారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణ సందర్భంగా మమత తీరును సుప్రీం కోర్టు తప్పుబట్టింది.మమత విచారణకు అడ్డు తగలడం మంచి పరిణామం కాదని వ్యాఖ్యానించింది. “కేంద్ర దర్యాప్తు సంస్థ కార్యకలాపాలకు ఒక రాష్ట్ర సీఎం అడ్డుతగులుతారా..? దీనికి పరిష్కారం ఏంటి..? మరో సీఎం కూడా ఇలాగే చేస్తే పరిస్థితి ఏంటి..? దీనికి పరిష్కారం ఉన్నప్పుడు మేం సరైన రీతిలో స్పందించాల్సిందే” అని కోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు వ్యాఖ్యలపై మమత, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తరఫు లాయర్ శ్యామ్ దివాన్ స్పందిస్తూ దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలన్నారు. అయితే, ఈడీ తరఫు న్యాయవాది తుషార్ మెహతా దీన్ని ఖండించారు. విచారణ ఆలస్యం చేసేందుకే ప్రభుత్వం సమయం అడుగుతోందన్నారు. దీంతో తాము తగిన ప్రొసీడింగ్స్‌తో విచారణ కొనసాగిస్తామన్నారు. కోర్టు ఏం చేయాలో మీరు చెప్పకూడదని మమత తరఫు లాయర్‌కు కోర్టు సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ప్రేమ పాఠాలు నేర్చుకోండి!..

## విద్యార్థులకు చైనా యూనివర్సిటీల ప్రోత్సాహం



**బీజింగ్, మార్చి 18( మహాప్రభ**
‘అబ్బా ఎప్పుడూ చదువులు.. ర్యాంకులేనా? కాసింత కళాపోషణ కూడా ఉండాలి కదా’ అంటూ చైనాకు చెందిన యూనివర్సిటీలు యువతను ప్రేమలో పడమంటూ ప్రోత్సహిస్తున్నాయి. ‘బాగా చదువుకోండి, మంచి గ్రేడ్‌లు తెచ్చుకోండి’ అంటూ ఇన్నాళ్లూ విద్యార్థులకు హిత వాక్యాలు చెప్పిన చైనా యూనివర్సిటీలు రూట్ మార్చి ‘ఎప్పుడూ ఈ పాఠాలేనా.. ప్రేమ పాఠాలు నేర్చుకోరా? అంటూ.. ఈ వసంత రుతువు సెలవుల్లో ప్రేమలో పడండి.. పూల పరిమళాలను ఆస్వాదించండి’ అంటూ తమ విద్యార్థులను బుజ్జగిస్తున్నాయి. దేశంలో వివాహాలు, యువ జనాభా తగ్గిపోవడంతో అధికారులు ఈ కొత్త మార్గాలను అనుసరిస్తున్నారు.‘పూలను చూడండి.. శృంగారాన్ని ఆస్వాదించండి’ థీమ్‌తో ఈ వసంత రుతువు సెలవులు సందర్భంగా సియాచిన్‌లోని సౌత్‌వెస్ట్ వొకేషనల్ కాలేజ్ ఆఫ్ యానియేషన్ తన విద్యార్థులకు నోట్ పెట్టింది. వేసవి, శీతాకాలపు సంప్రదాయ సమయాలతో పాటు పాఠశాలకు వసంత, శరదృతువు సెలవులను ప్రవేశపెడుతామని చైనా ప్రభుత్వం చెప్పిన రెండు వారాల తర్వాత టీచర్లు, విద్యార్థులు పుస్తకాలను పక్కన పెట్టేయమంటూ మంగళవారం వచ్చిన ఈ నోటీస్ అందరినీ ఆశ్చర్యపరిచింది. కాగా, చైనాలో 2025లో కూడా వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు తగ్గుదల నమోదైంది. ఇది మరింత తగ్గిపోవచ్చునని నిపుణులు హెచ్చరిస్తుండటంతో ప్రభుత్వం నష్ట నివారణ చర్యల్లో భాగంగా వీటిని ప్రవేశపెడుతున్నది. ప్రజలకు మరింత ఖాళీ సమయం కల్పిస్తే జననాలకు వేదికగా ఉంటుందని భావిస్తున్నది.

# ఢిల్లీలో నాలుగు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం :

## 9 మంది మృతి



**న్యూఢిల్లీ మార్చి 18( మహాప్రభ**
ఢిల్లీలోని పాలెంలో బుధవారం నాలుగు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందారు. ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. పాలెం మెట్రో స్టేషన్ సమీపంలోని శ్రీరామ్ చౌక్ వద్ద గల్లీ నెంబర్ -2లో ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ బిల్డింగ్‌లోని బేస్మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్‌లో బట్టల దుకాణంతోపాటు కాస్మెటిక్స్ షోరం కూడా ఉంది. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. టాప్ రెండు ఫ్లోర్లలో ఇంటి యజమానులు ఉంటారు. వారు నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులను ప్రవేశ్ (33), కమల్ (39), ఆషు (35), లాడో (70), హిమాన్ని (22)లుగా గుర్తించారు. వీరితోపాటు 15 ఏళ్లు, ఆరు, మూడు సంవత్సరాల చిన్నారులు కూడా అగ్నికి ఆహుతయ్యారు. దీపిక (28) అనే మహిళను ఇందిరిగాంధీ ఆసుపత్రికి తీసుకువచ్చేసరికి మృతి చెందింది. ఈ ఘటనలో గాయపడిన అనీల్, సచిన్, ఓ బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మృతులకు రెండు లక్షలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు తన సంతాపం తెలిపారు. ఈ ప్రమాద సమయంలో కాంగ్రెస్ సభ్యులు బాధితులకు సహాయం అందించాలని ఆమె కోరారు.

# చండీగఢ్‌లో పట్టపగలు కాల్పులు..

## 24 గంటల్లో రెండవ ఘటన




**చండీగఢ్ మార్చి 18( మహాప్రభ**
చండీగఢ్‌లో పట్ట పగలు దుండగులు ఒక వ్యక్తిని కాల్చి చంపారు. 24 గంటల వ్యవధిలోనే నగరంలో ఇది రెండవ కాల్పుల ఘటన. మోటార్‌బైక్ వచ్చిన ఇద్దరు దుండగులు బుధవారం ఉదయం జిమ్ నుండి బయటకు వస్తున్న చరణ్ ప్రీత్ అనే వ్యక్తి కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించాడని అన్నారు. కాల్పుల అనంతరం ఒక దుండగుడు పారిపోయాడని చెప్పారు. ముల్లన్‌పూర్ ప్రాంతానికి చెందిన చరణ్‌ప్రీత్‌పై గతంలో పలుమార్లు కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై దర్యాప్తుకు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. పంజాబ్ యూనివర్శిటీలోని బోటనీ విభాగం సమీపంలో గుర్తుతెలియని దుండగులు విద్యార్థి నేతపై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. అయితే కాల్పుల నుండి అతను తప్పించుకున్నాడు.

# ఇరాన్‌పై అమెరికా భారీ యాక్షన్

మొదటి తరువాయి

అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హార్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

# ఇరాన్‌కు వరుసఎదురు దెబ్బలు

**-ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం**

**-ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి**

**టెహ్రాన్,**



సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

## "మమ్మల్ని ప్రేమించి..మోదీని పెళ్లి చేసుకున్నారు"

మొదటి తరువాయి

అయితే ఖర్గే తన ప్రసంగంలో దేవగౌడతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. దేవగౌడ గతంలో దేశ ప్రధానిగా చేశారని, ఎన్నో కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించారని, ఆయన గత 54 ఏళ్లుగా తనకు పరిచయం ఉందని, ఆయనతో కలిసి పనిచేసినట్లు ఖర్గే తెలిపారు. అయితే ఏం జరిగిందో ఏం తెలియదు కానీ, తమతో డేటింగ్ చేసి, తమను ప్రేమించిన అతను.. ప్రధాని మోదీని పెళ్లి చేసుకున్నారని అన్నారు. దీంతో సభలోని సభ్యులందరూ నవ్వేశారు. అక్కడే ఉన్న ప్రధాని మోదీ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు .996 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఓ ఏడాది కాలం పాటు ప్రధానిగా దేవగౌడ చేశారు. యూనైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. ఆ ఫైట్‌లో ఆ కూటమి గెలిచింది. హెచ్‌డీ కుమారస్వామి సీఎం అయ్యారు. కానీ 2019లో ఆ ప్రభుత్వం కూలింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ జతకట్టిన విషయం తెలిసిందే. ఖర్గే తన ప్రసంగంలో మాట్లాడుతూ.. శరద్ పవార్, తిరుచ్చి శివతోనూ తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పారు. అయితే ఆ ఇద్దరీ మళ్లీ రాజ్యసభలోకి ఎంటర్‌కానున్నారు. కేంద్ర మంత్రి అత్వాలే గురించి ప్రస్తావిస్తూ.. ఆయన తన పద్యంలోని ప్రధాని మోదీని మెచ్చుకుంటారని, ఇక ఆయనకు మరో పద్యం రాదు అని అన్నారు. దీంతో సభ్యులు నవ్వుకున్నారు.

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

మొదటి తరువాయి

పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు.రాజ్యసభలో సీనియర్ సభ్యులుగా ఉన్న మాజీ ప్రధాని దేవగౌడ, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే, ఎన్సీపీ నేత శరద్ పవార్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆ ముగ్గురూ రాజకీయాల్లో మహాయోధులన్నారు. పార్లమెంట్ కోసం వారి సగం కన్నా ఎక్కువ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారు సభలకు హాజరువుతున్న తీరు, వారిలో అంకితభావం అసాధారణమైందన్నారు. కొత్తగా ఎంపికైన ఎంపీలు వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని ఆశించారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు.పార్లమెంట్ ప్రక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరంమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పదవి ఆఫర్.. అయినా సరే నో చెప్పిన విజయ్!

మొదటి తరువాయి

తిరస్కరించారని అర్జున అన్నారు.అది ఏ పార్టీయో చెప్పకపోయినప్పటికీ బీజేపీయే అని కొందరు టీవీకే నేతలు అంటున్నారు. ఇటీవల విజయ్ కూడా ఈ ఎన్నికల వరకు తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. విజయ్ పార్టీతో తమ పార్టీ చర్చలు జరపడం లేదని ఏఐఏడీఎంకే కూడా ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ మాత్రం అధికార డీఎంకేను ఓడించాలంటే పొత్తు అవసరం అని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో మాత్రం విజయ్ పార్టీ టీవీకే ఒంటరిగానే పోటీ చేసే అవకాశాలున్నాయి. విజయ్ తన పార్టీ అభ్యర్థుల జాబితాను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశాలున్నాయి. విజయ్ పెరంబూర్ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన మరో కీలక నేత ఎన్ ఆనంద్ టీ నగర్ నుంచి, జనరల్ సెక్రెటరీ అధవ్ అర్జున విల్లివక్కం నుంచి పోటీ చేస్తారు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఎన్నిక జరగనుంది. మే 4న ఫలితాలుంటాయి.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

మొదటి తరువాయి

రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

# విజన్‌తో ముందుకెళ్తాం

మొదటి తరువాయి

ఎదిగి సీఎం అయ్యాననీ, 2029లోనూ తమదే అధికారమని స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ రెండు పార్టీల వైఖరులను తప్పుబడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం స్పీకర్ సభను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తెలంగాణ ప్రజల, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని గవర్నర్ ప్రసంగం తయారు చేశారన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి అప్పు తెస్తే కేంద్రం చుట్టూ తిరిగి దాన్ని 7.5 శాతం తగ్గించుకున్నామనీ, పార్టీ పరంగా సైద్ధాంతికంగా విభేదాలున్నప్పటికీ ఈ విషయంలో సహకరించిన నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చిన మూడు నెలల్లో పరీక్షలు ఎందుకు నిర్వహించలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు వేయడం, కోర్టులకు ఎక్కేలా చేయడం, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ఆనాడు షరామామూలుగా జరిగిందన్నారు. అదే బంధువు, కుటుంబ సభ్యురాలు ఎంపీగా ఓడిపోతే మూడు నెలల్లో వారికి పోస్టులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. తమ పాలనలో 80వేలకు పైగా ఉద్యోగాలను భర్తీచేశామని నొక్కి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతిపక్షం కలిసి వస్తుందని భావించినా...వారి అహంకార ధోరణి ఇంకా పోలేదని విమర్శించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.అధికారం పోయినా ఇంకా తామే రాజులమనే భావనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారనీ, రాచరికంలో వారసత్వానికి అవకాశం ఉందిగానీ ప్రజాస్వామ్యంలో దానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతల్లి ఆవిష్కరణకు ప్రధాన ప్రతిపక్ష నేత వస్తారని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. ప్రజలు బుద్ధి చెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా అదే అహంకార పూరిత ధోరణి వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా జీతం రూపంలో కోటీ ఆరు లక్షల



రూపాయలు తీసుకున్న వ్యక్తి సభకు గైర్హాజరు కాకపోవడం సరిగాదనీ, విధులకు హాజరుకాకుండా ఉన్నవారిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముందు చూపుతో స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రణాళికలతో ముందుకెళ్లడం, ఆ తర్వాత ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ తీసుకున్న కీలక నిర్ణయాలు, సంస్కరణలు ప్రపంచం ముందు భారత్‌ను ఒక శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇచ్చిన, సీలింగ్, అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనన్నారు. వారి వ్యూహాత్మక ఎత్తుగడలతోనే నేడు ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు మన దేశం వారు సీఈఓలుగా ఉన్నారని గుర్తుచేశారు. సిలికాన్ వ్యాలీలో మన తెలుగువాళ్లు రాణించడానికి కారణం రాహుల్‌గాంధీ, పీవీ, మన్మోహన్‌సింగ్ తీసుకున్న సంస్కరణలే కారణమని వివరించారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శంకుస్థాపన చేస్తే చంద్రబాబు ముందుకు తీసుకెళ్లారని తెలిపారు.

**ఆక్రమణలు తొలగించడం... నాలాలను రక్షించడం ఇష్టం లేదా?**

తాము మూసీ సుందరీకరణ చేస్తామంటే ప్రతిపక్షం అడ్డుపడుతామని చెప్పటాన్ని సీఎం తప్పుబట్టారు. ఆక్రమణలు తొలగించడం, పరిశ్రమలు తరలించడం, చెరువులు, నాలాలను పరిరక్షించడం లాంటి మంచి చేయొద్దా? అని నిలదీశారు. కాలుష్యంతో రాజధాని ఢిల్లీ, వర్షాల ఎఫెక్ట్‌తో ఫైనాన్సియల్ రాజధాని ముంబై, ట్రాఫిక్ సమస్యతో బెంగుళూరు నగరాలు కూరుకుపోవడంతో ఐటీ, తదితర రంగాల పరిశ్రమలు తెలంగాణ వైపు చూస్తున్నాయని వివరించారు. నల్లచెరువును హైడ్రా రక్షిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారనీ, ఉమర్‌ఉద్దౌల్లా చెరువు పునరుద్ధరిస్తే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. తుమ్మిడి కుంటను ప్రముఖ సినీస్టార్ అక్రమించుకుంటే ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడామనీ, రియల్టర్ల కబ్జా నుంచి సున్నం చెరువును రక్షించుకున్నామని వివరించారు. బేగంపేటలో 200 ఫీట్ల ఉన్న నాలా 30 ఫీట్లకు కుచించుకుపోయిందనీ, హైదరాబాద్ నగరాన్ని కొంత మంది దురాశపరులు ఆక్రమణలకు పాల్పడితే కాడపాడుతున్నామని నొక్కి చెప్పారు.

ఇలా మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడమేంటని నిలదీశారు. హైదరాబాద్ నగరంలో నాలాలపై 28వేల అక్రమ కట్టడాలున్నాయనీ, చట్టం ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేయాలని చెబుతున్నదని కేసీఆర్ అనలేదా? ప్రశ్నించారు. డ్రోన్లతో, మ్యానువల్‌గా సర్వేలు చేయించి అక్రమ కట్టడాలను జేసీబీలతో కూల్చేస్తామని కేటీఆర్ చెప్పలేదా? అని నిలదీశారు. మూసీలో కంటే వీళ్ల కడుపులో ఎక్కువ విషం ఉందని విమర్శించారు. మీ పాలిత రాష్ట్రాల్లో సబర్మతీ, గంగా, యుమునా రివర్ ఫ్రంట్ల పేరుతో ప్రక్షాళన చేస్తున్నారు కదా? సబర్మతిలో వేల కుటుంబాలు నిర్వాసితులు అయ్యారు కదా? అందులో ఎంత మందికి పరిహారం ఇచ్చారు? దానిపై నిజనిర్ధారణ కమిటీ వేసి పంపుదామా? ఇక్కడ మూసీ ప్రక్షాళన చేసుకుంటుంటే వచ్చిన సమస్య ఏంటి? అని బీజేపీ సభ్యులను ప్రశ్నించారు. హైదరాబాద్‌లో పర్యావరణాన్ని మెరుగుపర్చేందుకు డీజిల్‌తో నడిచే 2800 ఆర్టీసీ బస్సుల స్థానంలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురాబోతున్నామని తెలిపారు. నగరంలోకి డీజిల్, పెట్రోల్ ఆటోలకు ఈవీ ఇంజన్లను పిట్ చేయిస్తామన్నారు. ఈవీ వాహనాలను కొంటున్నవాళ్లపై పన్ను వేయట్లేదని స్పష్టం చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు, మూడు కమిషనరేట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డబ్బుల కోసం వాళ్లు మెట్రోను ఆపితే తాము ట్రాఫిక్ నియంత్రణకు మెట్రోను విస్తరిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలకులు ఔటర్ రింగ్‌రోడ్డును పల్లీబఠాణీలకు అమ్ముకున్నారని విమర్శించారు. పబ్లిక సెక్టార్‌ను తెగనమ్ముతున్న ఈ రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం మెట్రోను స్వాధీనం చేసుకున్నదని గుర్తుచేశారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ రింగ్ రైలు కూడా రాబోతున్నదని తెలిపారు. కేంద్రం బుల్లెట్ ట్రైన్ హబ్ ను తెలంగాణకు ఇచ్చిందన్నారు.

# రాష్ట్రాలకు అదనంగా మరో పదిశాతం ఎల్‌పీజీ

## తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,**

: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది.




దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

# మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం

మొదటి తరువాయి

సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంవద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం

## పరాభవనామ ఉగాది !




కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య-మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు.ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం.ఇది మార్గశిర-పుష్య-మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు.మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు.సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం- 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చించి.కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ష పక్షం ప్యాడ్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళనాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్ ' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటే..మరోవైపు వేడివేడిగా భక్ష్యాలు తయారవు తుంటాయి. ఉగాది పచ్చడి...వంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శుభం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్ల పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు. కొత్త పసులు, కొత్త వ్యాపారాలు కూడా ఉగాది నాడు మొదలు పెడుతుంటారు కొందరు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ పంచాంగ శ్రవణం వినడం పట్ల ఈ సంవత్సరంలో జరగబోయే మంచి చెడులతో పాటు పరిణామాలు తెలుసుకుంటారు. కలియుగంలో నక్షత్ర ఫలితాలతో పాటు రాశిఫలాలు.. ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు తెలుసుకుంటారు. ఇది జాగ్రత్తగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది.

------------------

# దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు:

**నల్గొండ జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్,**



**దేవరకొండ మార్చి 18( మహాప్రభ**
దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బి ఆర్ ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రామవత్ రవీంద్ర కుమార్ ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు, అన్నదాతలు తమ వ్యవసాయ పనులను ఉగాది నుండి కొత్తగా ప్రారంభిస్తారని, వ్యవసాయ నామ సంవత్సరంగా ఉగాది నిలుస్తుందని ఆకాంక్షించారు, ప్రకృతితో మమేకమై వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలతో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొని సబ్బండ వర్గాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని పేర్కొన్నారు, ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనములో అది పండుగగా ఉగాది ప్రత్యేక స్థానం ఉందన్నారు, చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతన ఉత్సవాన్ని సంతరించుకుంటుందని తెలిపారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పులు తీసుకురావాలని ఆశించారు, అప్పుడే పరాభవ నామ నూతన సంవత్సరానికి సంపూర్ణత లభిస్తుందని ఆయన తెలిపారు, ఉగాది పచ్చడి మాదిరి జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతి సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్ధమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ఆయన తెలిపారు, ఈ నూతన సంవత్సరం లో సాగునీరు త్రాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య.




**దుబ్బాక మార్చి 18( మహాప్రభ**
చేతికి అంది వచ్చిన పంట నీరు లేక ఎండిపోవడంతో, చేసిన అప్పులు తీర్చలేక జీవితం మీద విరక్తి చెందిన రైతు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మండలం రగోతంపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ ఐ, కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన రెడ్డి మోహన్ రెడ్డి (40) భార్య, పిల్లలతో జీవనం కొనసాగిస్తూ తనకు వ్యవసాయ భూమిలో వారిని సాగు చేస్తున్నాడు. ఇటీవల వేసిన వరి పంట సాగుకు నీరు లేకపోవడంతో అప్పులు చేసి రెండు బౌలర్ వేసిన నీరు రాలేదు. ఫలితంగా ఒకవైపు పంట ఎండిపోవడంతో పాటు చేసిన అప్పులు పెరిగిపోయాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గుర్తుయి బుధవారం ఉదయం మోహన్ రెడ్డి తన పొలం రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్ ఐ తెలిపారు.

# గ్లోబల్ క్రిస్టియన్ లా బోర్డ్ ప్రారంభించడం శుభ పరిమాణం

**రెవరెండ్, వి, జోసెఫ్, ( ఫౌండర్ డ ప్రెసిడెంట్, జి ఎల్ ఎం డబ్ల్యు ఏ )**

**దేవరకొండ మార్చి 18( మహాప్రభ**
హైదరాబాద్ మెట్టుగూడ లో ఏర్పాటు చేసిన " గ్లోబల్ క్రిస్టియన్ లా బోర్డు " ఏర్పాటు చేయడం క్రైస్తవ మైనార్టీలకు శుభ పరిమాణం అని రెవరెండ్, వి, జోసెఫ్ హర్షం వ్యక్తం చేశారు, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించి ఈ బోర్డ్ క్రైస్తవులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని, క్రైస్తవ స్త్రీలకు, పేద క్రైస్తవులకు, ఫ్రీ లీగల్ సర్వీస్ తోడ్పాటును అందిస్తుందని తెలపడం ఎంతో గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు, క్రైస్తవులలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న సమస్యలున్న గ్లోబల్ క్రిస్టియన్ లా బోర్డును సంప్రదించి పరిష్కరించుకోవాలని, క్రిస్టియన్ మహిళలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల కు ఉపయోగపడుతుందని తెలియపరచడం క్రైస్తవులందరికీ సంతోషమని ఆయన సంతోషాన్ని వ్యక్తపరిచారు

# రంజాన్ తోఫా పంపిణీతో ముస్లిం సోదరులకు అండగా అఖిల రాజ్ ఫౌండేషన్



**దుబ్బాక మార్చి 18( మహాప్రభ**
దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చీకుడు గ్రామంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం, రంజాన్ తోఫా, పంపిణీ కార్యక్రమాన్ని అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కూకట్పల్లి ఎస్ ఐ, తౌడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిరుపేద ముస్లిం సోదర, సోదరీమణులకు అండగా 70 ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకులు, 20 మంది వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుకట్పల్లి ఎస్ ఐ, సత్యనారాయణ మాట్లాడుతూ.... రంజాన్ పండగ ఆత్మీయ, సహకారం, దాతృత్యానికి ప్రతిక అని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సహాయం చేయడమే తమ బాధ్యత అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలతో సామాజిక సామరస్యం మరింత బలపడుతుందని అందరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్మిరె నరేష్, ఉప సర్పంచ్ కొండల్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గం, పోతారం గ్రామ సర్పంచ్ రేణుక మల్లేశం, అఖిల రాజ్ ఫౌండేషన్ సభ్యులు ఇనుప రవి, బిట్ల భాస్కర్, కంకణాల చంద్రం, వనం పోశయ్య, బండ నర్సింలు, ఇనుప రాజనర్స్, చంద్రం పోచయ్య, గ్రామస్తులు ముస్లిం సమాజ నాయకులు మొత్తం 100 మంది ముఖ్య వ్యక్తులు పాల్గొన్నారు.


# ఎస్ ఎఫ్ ఐ యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ: బుడిగ వెంకటేష్




**దేవరకొండ మార్చి 18( మహాప్రభ**
దేవరకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 15 నుండి 23 వరకు నిర్వహించనున్న విద్యార్థి యువజన ఉత్సవాల పోస్టర్ ను డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ బుజవారం ఆవిష్కరించారు, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు, ముఖ్యంగా విద్యార్థులు, యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన సూచించారు, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు

# పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి:

**- వడ్డెర సంఘం అధ్యక్షులు, ఇరగ దిండ్ల కృష్ణ,**



**దేవరకొండ మార్చి 18( మహాప్రభ**
దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ కృష్ణ ప్రజలందరికీ, వడ్డరి సోదరీ సోదరిమణులందరికీ శ్రీ పరాబనామ సంవత్సరం ఉగాది పర్వదిన శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగువారి తొలి పండుగ ఉగాది ప్రజలందరి జీవితాలలో నూతన వెలుగులు నింపాలని అన్నారు, ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని తెలిపారు, ఈ కొత్త ఏడాదిలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# ఉగాది పచ్చడితో మొదలు...

**- కూల్ కూల్ గా ఉండే మట్టి కుండ**



**దుబ్బాక మార్చి 18( మహాప్రభ**
మట్టి కుండలకు రాను రాను డిమాండ్ పెరిగిపోతుంది, అనాదిగా మనిషి జీవనం విధానాలతో ముడిపడిన కుండలను ప్రతి ఒక్కరు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తుంది ఎండాకాలం వచ్చిందంటే చల్లదనం కోసం ఇచ్చే కుండను జనం కొనుగోలు చేస్తారు. ఇలా కొనే కుండలను ఉగాది కొత్త కొండ అని పిలుచుకుంటారు. పచ్చడితోపాటు పాలు పెరుగు పెట్టుకోవడం కోసం ఉగాది పచ్చడి తయారు చేసి కుటుంబ సభ్యులంతా తాగడం జరుగుతుంది. ఏడాది మొత్తం ఉపయోగించుకుంటారు. ఎన్ని రకాల వంట పాత్రలు వచ్చినప్పటికీ తిరిగి ప్రాచీర కాలంనాటి మట్టి పాత్రలకి ప్రస్తుతం గిరాకీ పెరిగింది. రోడ్ల పక్కన పట్టణాలలో మండల కేంద్రాలను గ్రామీణ ప్రాంతాలలో మట్టికుండలకు విపరీతంగా గిరాకీ పెరుగుతోంది మట్టి కుండలో నీరు తాళం మట్టి పాత్రలు వంట చేసుకోవడం ఎంతో శ్రేయస్సుకరమని పురాణాలు చెబుతున్నాయి మట్టి పాత్రలకు రోజు రోజుకు డిమాండ్ పెరిగిపోవడం జరుగుతుంది. కొండల ప్రాధాన్యత పెరిగింది ప్రస్తుతం మట్టి పాత్రలు వాడకం ద్వారా పెరుగుతుంది వస్తుంది ఆయుష్ ను పెంచే మట్టి కుండల ప్రాధాన్యత గుర్తించిన చాలామంది వినియోగించుకోవడం కోసం ఆసక్తి చూపుతున్నారు కుండల తయారీలో ఉపయోగించే బంక మట్టి అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తుంది

# ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

**-మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు ఘనంగా ఇఫ్తార్ విందు.**
**-మెదక్ లో ఘనంగా ఇఫ్తార్ విందు**




**మెదక్ జిల్లా మార్చి 18( మహాప్రభ**
పవిత్రమైన రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావుపేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం బుధవారం మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్స్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహకారం పెంపొందించే పవిత్రమైన కాలమని అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముస్లిం సోదరుల అభ్యున్నతికి విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.రంజాన్ పండుగ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని అన్నారు.తెలంగాణ రాష్ట్రం అన్ని మతాలు, వర్గాలు కలిసి జీవించే సంస్కృతికి నిలయమని తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు. ఉపవాసం ద్వారా ఆత్మశుద్ధి సాధించడం, పేదలకు దానం చేయడం వంటి గొప్ప విలువలను రంజాన్ మాసం గుర్తు చేస్తుందని అన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆర్డిఓ రమాదేవి మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు తోడుపునూరి చంద్రపాల్,గూడూరి కృష్ణ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాదర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్ మున్సిపల్ కౌన్సిలర్లు తోడుపునూరి శివ రామకృష్ణ, గంట సంపత్, శశాంక్, మన్సుర్,హరిత, నర్సింలు జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, బొజ్జ పవన్,మ్యాడం బాలకృష్ణ, గూడూరి ఆంజనేయులు సలీం,హాఫిజ్ మొల్సబ్,సమీ మంగ మోహన్ గౌడ్,ప్రశాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి,హంజద్,ముత్యంగౌడ్ ఉమర్,హమీద్ మహేష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్ , శంకర్ గౌడ్,నిఖిల్,ఖాలేక్, తాహెర్, రియాజ్, కొండా శ్రీను గుప్తా, బాలరాజ్, దిలీప్ ఏఎస్పి మహేందర్ డిఎస్పి ప్రసన్న కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

# నిజామాబాద్ నుండి భద్రాచలనికి గోటి తలంబ్రాల దీక్ష





**-300 మంది భక్తులతో గోటి తలంబ్రాలు దీక్ష**
**- రామకోటి రామరాజుకు విఠలేశ్వర కమిటీ సన్మానం**
**-మొదటిసారి మా గ్రామానికి తలంబ్రాలు రావడం అదృష్టం న్న భక్తులు**

**దుబ్బాక – మార్చి 18( మహాప్రభ**
భద్రాచల సీతారాముల కల్యాణానికి అందించే గోటి తలంబ్రాల కార్యక్రమం కోటి తలంబ్రాల దీక్ష నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామంలోని విఠలేశ్వర మందిరం ఆధ్వర్యంలో బుధవారం నాడు ఘనంగా జరిగింది. శ్రీరామ కోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భద్రాచలం నుండి తీసుకొచ్చిన గోటి తలంబ్రాలకు పూజలు జరిపి 300 మంది భక్తులచే మూడు గంటలపాటు రామనామ స్మరణ చేయిస్తూ గోటితో వడలను ఒలిచి తలంబ్రాలుగా మార్చారు. భక్తులు అక్కడే రామకోటి రామరాజుకు అందజేశారు. 4వసారి కళ్యాణానికి 3 క్వింటాళ్ల బోటి తలంబ్రాలు తెలంగాణ రాష్ట్రం నుండి అందిస్తున్నామని రామకోటి రామరాజు తెలిపారు. మేము భద్రాచలం వెళ్లలేకపోయినా కూడా, మేము ఓలిచే తలంబ్రాలు మొదటిసారిగా భద్రాచల కళ్యాణానికి వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యఫలం భక్తులు ఆనందాన్ని వెల్లుబుచ్చారు. ఇంతటి అదృష్టాన్ని అందించిన రామకోటి రామరాజును కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



**ఆమనగల్లు, మార్చి 18( మహాప్రభ**
శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకాక్షించారు. ఆయన బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. మనకు కొత్త సంవత్సరంలో పండుగలు ఉగాది నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఉగాది పచ్చడిలా ప్రజల జీవితాల్లో షడ్రుచులు ఉండాలని, కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# వికలాంగులకు ఉచిత బస్సు సర్వీస్ ప్రారంభించిన ఆర్డిఓ






**మార్చ్ 18 తిరుపతి జిల్లా ( సూళ్లూరుపేట) మహాప్రభ**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో 40% కన్నా ఎక్కువగా ఉన్న వికలాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు. బుధవారం సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వికలాంగుల కు సూళ్లూరుపేట ఆర్డీవో జండా ఊపి ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ వికలాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒక గొప్ప వరం అని తెలిపారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు సర్వీస్, అలానే వికలాంగులకు ఉచిత బస్ సర్వీస్ కూడా సక్సెస్ అవుతుందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఆకుతో రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిలో అలుపెరగకుండా శ్రమిస్తూ, మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. పై కార్యక్రమంలో తహసిల్దార్ గోపీనాథ్ రెడ్డి, ఎంపీడీవో మురళి, వెంకటేష్ యాదవ్, కొండూరు సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, వికలాంగులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డి మండల కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం





**దుబ్బాక – మార్చి 18( మహాప్రభ**
సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో కాసేపటి క్రితం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందడం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి నుంచి అల్వాల్ వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు అతివేగంగా వెళ్లి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడిపిన యువకులు ఎక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. హాయ్ అన్నతోపాటు ఇద్దరు బాలురుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్ లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షేత్రగాత్రులు మిరుదొడ్డి గ్రామానికి చెందిన వారిగా స్థానికులు తెలిపారు.

# పకడ్బందీగా ఓటరు జాబితా

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**




**మెదక్ జిల్లా,మార్చి 18( మహాప్రభ**
పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనం కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలని అన్నారు. సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు తహసిల్దారులు అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలు



**కరీంనగర్, మార్చి 18( మహాప్రభ**
ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల బోటనీ విభాగంలో పరాభవ నామ ఉగాది పండుగను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఉప ప్రిన్సిపాల్ నితిన్ పాటక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో స్టాఫ్ క్లబ్ కార్యదర్శి మల్లారం శ్రీనివాస్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఉగాది పండుగ ప్రాముఖ్యతను ఉప ప్రిన్సిపాల్ వివరించి, ఇది కొత్త ఆశలు, కొత్త ఆరంభాలకు సంకేతమని, ఉగాది పచ్చడి జీవనంలోని సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుందని అన్నారు. విభాగాధిపతి మాట్లాడుతూ, వసంత ఋతువులో మొక్కలు కొత్త చిగురులు తొడుగుతున్నట్లే మన జీవితాల్లో కూడా కొత్త ఆశలు పుట్టాలని, ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉగాది ప్రాధాన్యంపై ప్రసంగాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా అందరూ కలిసి ఉగాది పచ్చడి రుచి చూసి పరస్పరం శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న గణాంక శాఖ అధికారి



**కరీంనగర్, మార్చి 18( మహాప్రభ**
జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా కరీంనగర్ జిల్లా బోయిన్‌పల్లి, స్తంభంపల్లి, గుండన్నపల్లె గ్రామాల్లో గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ పర్యటించారు. మొదట సాధారణ వివరాలు సేకరించి, అనంతరం ట్యాబ్ ద్వారా కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి వివరాలు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. కుటుంబ యజమాని పేరు, సభ్యుల విద్యా అర్హతలు, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలీల పనిగంటలు, వేతనాలు, మహిళల ఆదాయ వివరాలు వంటి అంశాలను నమోదు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి ఎంపీడీవో జయశీల, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, ఎండి జాఫర్ హైమద్, గ్రామ సర్పంచులు బోనగాని అశోక్ గౌడ్, కొప్పుల లావణ్య, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, చిలువేరి కిషన్, వార్డ్ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టాంప్ పేపర్ల అక్రమ దందాపై ఫిర్యాదు




**కరీంనగర్, మార్చి 18( మహాప్రభ**
కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో వంద రూపాయల స్టాంప్ పేపర్ల కొరత తీవ్రంగా ఉందని, కొంతమంది లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వెలువడ్డాయి. ఈ విషయంపై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారికంగా ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ పొందిన ప్రతి వెండర్ వద్ద ప్రజలకు సరైన ధరకు స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన కోరారు. బ్లాక్ విక్రయాల కారణంగా కరీంనగర్ పట్టణంలో తీవ్ర కొరత ఏర్పడిందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజేయ్, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, యం.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ఉపాధ్యక్షుడు కనకం నరేష్, బి.సి సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గందే కొమురయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి, కుమార్తె సజీవ దహనం

### - అల్లుడే చంపినట్లు అనుమానం





**హన్మకొండ మార్చి 18( మహాప్రభ**
హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో దారుణం చోటు చేసుకుంది. తండ్రీ కుమార్తెలు సజీవ దహనమయ్యారు. అల్లుడు ప్రవీణ్ కుటుంబ కలహాలతో ఇద్దరినీ సజీవదహనం చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కడిపికొండ రాజీవ్ గృహకల్పలో నిన్న తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. భాషబోయిన రాజశేఖర్ (54) అతని కుమార్తె రాజశ్రీ (24) మంటల్లో కాలిపోతుంటే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే, ఆటో డ్రైవర్గా పని చేస్తున?న భాషబోయిన రాజశేఖర్కు ముగ్గురు కుమార్తెలు కాగా రాజశ్రీ పెద్దమ్మాయి. అల్లుడు ప్రవీణ్ హైదరాబాద్లో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. వీరికి మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల బాబు, ఆరు నెలల పాప ఉన్నారు. సంక్రాంతి పండుగకు పిల్లలతో వచ్చి తండ్రితో పాటే హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని రాజీవ్‌గృహకల్పలో బ?లాక్ 5లో ఉంటోంది. కుటుంబ తగాదాలు, భార్యతో గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఈ తరుణంలో రాజశేఖర్, రాజశ్రీ (24) సజీవ దహనమైయారు. భార్యతో గొడవలు తదితర కారణాలతో అల్లుడు ప్రవీణే భార్య, మామను హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుత్తితో తలమీద కొట?టి ఇద్దరిపైన డీజిల్ పోసి తగలుబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశాడని అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ను అదుపులోకి తీసుకొని విచారిస?తున్నారు. పోలీసుల విచారణలో ప్రవీణ్ పొంతనలేని సమాధానాలు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిన్నటివరకూ బాగానే ఉన్న తండ్రీ కుమార్తెలు ఇద్దరూ మంటల్లో కాలిపోయి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రాజశ్రీ చనిపోవడంతో రెండేళ్ల బాబు, ఆరు నెలల పాప అనాథలయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "భాషబోయిన రాజశేఖర్ ముగ్గురు కుమార్తెలు. రాజశేఖర్ భార్య పిల్లల భాల్యంలోనే మృతి చెందారు. రాజశ్రీని ప్రవీణ్కి ఇచ్చి పెళ్లి చేశారు. సంక్రాంతి పండుగకు తండ్రి వద్దకు పిల్లలతో వచ్చిన రాజశ్రీ అత్తగారింటికి వెళ్లలేదు. భార్యభర్తలు మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. కుటుంబ తగాదాలు ఉన్నట్లు తెలిసింది. మాకు ఎప్పుడు కూడా చెప్పలేదు. రాజశ్రీ ప్రవీణ్కి ఇద్దరు సంతానం. రెండేళ్ల బాబు, ఆరు నెలల పాప ఉన్నారు"

## రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 18( మహాప్రభ**
రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌గా తొలిసారిగా గెలిచిన పొన్నం అశోక్ గౌడ్ కరీంనగర్ జిల్లా కోర్టుకు వచ్చిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా కోర్టు న్యాయవాదుల సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అశోక్ గౌడ్‌ను శాలువా, పూల బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నా విజయం కోసం కృషి చేసిన న్యాయవాదులకు పేరు పేరున కృతజ్ఞతలు. బార్ కౌన్సిల్ కోసం కృషి కొనసాగుతుంది, అందరూ వెంట ఉండాలి అని అన్నారు. తరువాత పలువురు న్యాయవాదులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ బాధ్యులు భుక్య రజనీస్, కొత్త ప్రకాశ్, కె. శంకర్, సృజన్, గౌతం రాజ్, సీనియర్ న్యాయవాదులు పి. ప్రభాకర్ రావు, పి. సజన్ కుమార్, పెంచల లక్మన్ రావు, కూర శ్రీనివాస్ రెడ్డి, గంజి స్వరాజ్ బాబు, బి. నర్సింహ రెడ్డి, పి. వేణుగోపాల్, ఉప్పుల అంజన్ కుమార్, టి. పవన్, పి. రాజన్న, కె. శ్రీనివాస్, వి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు


## బెల్టు షాపులపై ఆందోళన



**పెద్దపల్లి, మార్చి 18( మహాప్రభ**
కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని సామాజిక ఉద్యమకారుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్, దీ=ూ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల స్వామి వివేక్ పటేల్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా ఫిర్యాదు చేశారు. కిరాణా షాపుల్లో పగలు--రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, యువత మద్యానికి బానిసై చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి, కాల్వ శ్రీరాంపూర్ గ్రామాల్లో మూడు మద్యం షాపులు నడుస్తున్నాయని, వీటి యజమానులు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ అధిక ధరలకు గ్రామస్తులకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీంతో యువత మద్యం మత్తులో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల మైదానాల్లో కూడా రాత్రివేళ మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు పారేస్తున్నారని, తక్షణమే కలెక్టర్ స్పందించి కాల్వ శ్రీరాంపూర్ మండలం 23 గ్రామాల్లో, పెద్దపల్లి మండలం 30 గ్రామాల్లో బెల్టు షాపులను మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పేదరికాన్ని జయించిన పట్టుదల


**-ఐబిపిఎస్ క్లర్క్‌గా ఆలేటి రామస్వామి.**
**-తల్లిదండ్రుల కష్టాన్ని చూసి కసిగా చదివి విజయం సాధించిన యువకుడు.**



**దేవరకొండ మార్చి 18( మహాప్రభ**
ఎంతటి కటిక పేదరికమైనా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా దృఢ సంకల్పం ఉంటే విజయం వరిస్తుందని నిరూపించాడు ఆలేటి రామస్వామి. అట్టడుగు వర్గం నుండి వచ్చి, అత్యంత కఠినమైన ఐబిపిఎస్ , పరీక్షలో క్లర్క్ ఉద్యోగం సాధించి తన గ్రామానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. నల్గొండ జిల్లా, డిండి మండలం, ప్రతాప్ నగర్ గ్రామపంచాయతీ కి చెందిన పెద్దమరయ్య, పెద్దులమ్మ దంపతుల కుమారుడు రామస్వామి (23). రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వారిది. తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కొడుకును చదివించారు. తన కళ్ల ముందే తల్లిదండ్రులు పడుతున్న శ్రమను చూసి చలించిన రామస్వామి, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి వారి కష్టాలను తీర్చాలని నిశ్చయించుకున్నాడు. కేవలం 23 ఏళ్ల వయసులోనే, మొదటి ప్రయత్నాల్లోనే బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించడం రామస్వామి పట్టుదలకు నిదర్శనం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈ యువకుడు, సరైన వసతులు లేకపోయినా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ఓర్పుతో, క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడాడు. రామస్వామి సాధించిన ఈ విజయం పట్ల స్థానికులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబం నుండి వచ్చి బ్యాంక్ ఉద్యోగం సాధించడం సామాన్యమైన విషయం కాదని, నేటి యువతకు రామస్వామి ఒక గొప్ప ఆదర్శమని కొనియాడుతున్నారు. రామస్వామి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందరూ కోరుకుంటున్నారు.

# బిజినెస్

## మూడోరోజూ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 633, నిఫ్టీ 196 పాయింట్లు వృద్ధి



**ముంబై, మార్చి 18 :**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో కళకళలాడుతున్నాయి. పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్నప్పటికీ మదుపరులు మాత్రం కొనుగోలుకు మొగ్గుచూపారు. ఫలితంగా వరుసగా మూడోరోజూ బుధవారం కూడా సూచీలు ఒక్క శాతం వరకు బలపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు తగ్గుముఖం పట్టడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు ర్యాలీకి తోడయ్యాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 633.29 పాయింట్లు అందుకొని 76,704.13 వద్ద స్థిరపడింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 196.65 పాయింట్లు ఎగబాకి 23,777.80 పాయింట్లకు చేరుకున్నది.

**9 లక్షల కోట్లు పెరిగిన సంపద**
స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో మదుపరులు సంపద అమాంతం పెరిగింది. వరుసగా మూడు రోజుల్లో వీరి సంపద రూ.9 లక్షల కోట్లకు పైగా ఎగబాకింది. గత మూడు సెషన్లలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,140.21 పాయింట్లు లేదా 2.87 శాతం బలపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.9,18,579.57 కోట్లు బలపడి రూ.4,39,00,831 కోట్లు(4.75 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది.

## రూపీ @92.89.. డాలర్ ముందు దేశీయ కరెన్సీ విలవిల

**--ఆల్‌టైమ్ కనిష్ఠానికి మారకం విలువ**
**--ఒక్కరోజే 49 పైసలు పతనం**



**ముంబై, మార్చి 18**
డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రోజుకో రికార్డు స్థాయికి దిగజారుతున్నది. బుధవారం ఫారెక్స్ మార్కెట్‌లో మరోమారు ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ వ్యాల్యూ క్షీణించింది. ఈ ఒక్కరోజే 49 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా 92.89 వద్దకు పతనమైంది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌పై 92.42 దగ్గర మొదలైన రూపీ ట్రేడింగ్.. అంతకంతకూ బలహీనపడుతూ చివరకు 92.89 వద్ద ముగిసింది. మంగళవారం 92.40 దగ్గర స్థిరపడిన విషయం తెలిసిందే.

**ఇదీ సంగతి..**
అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగబాకుతున్న ముడి చమురు ధరలు, భారతీయ దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరుగుతున్న డిమాండ్, దేశీయ మార్కెట్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు.. రూపాయి ఉసురు తీస్తున్నాయని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. కాగా, నష్టపోతున్న రూపాయి మారకం విలువ.. భారత్‌లోకి దిగుమతయ్యే ప్రతి వస్తూత్పత్తి ధరను మరింత పెంచుతుందని ఆర్థిక విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం విదేశాల నుంచి వచ్చే దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో రూపాయి క్షీణత.. యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థనే ప్రమాదంలో పడేస్తున్నదని హెచ్చరిస్తున్నారు. మరిన్ని డాలర్లను చెల్లించి కావాల్సినవి కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ద్రవ్యోల్బణం ఇంకా పెచ్చుమీరుతుందని అంటున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధిరేటు, ఉద్యోగావకాశాలు, తయారీ, వినిమయ సామర్థ్యం, కొనుగోలు శక్తి, రుణ లభ్యత.. అన్నీ ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


## ఆడీ క్యూ8 మాడల్.. ప్రారంభ ధర రూ.1.77 కోట్లు

**ముంబై,**
జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ..దేశీయ మార్కెట్లోకి మరో లగ్జరీ మాడల్‌ను తీసుకొచ్చింది. ఎస్‌యూవీ పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో నయా క్యూ8 మాడల్‌ను ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.1,77,72,000. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. శక్తివంతమైన 4.0 లీటర్ వీ8 టీఎఫ్ఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు కేవలం 4.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది.గంటకు 250 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. హెచ్‌డీ మ్యాట్రిక్స్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, పానోరమిక్ సన్‌రూఫ్, స్పోర్ట్ సీట్స్, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది. ఈ కారుపై పదేండ్ల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ వ్యారెంటీని కల్పిస్తున్నది.




# స్పోర్ట్స్

## సన్ రైజర్స్ కొత్త కెప్టెన్‌గా ఇషాన్ కిషన్



హైదరాబాద్
నిరుడు దేశవాళీల్లో సత్తాచాటి టీ20 ప్రపంచకప్‌లో అనూహ్యంగా జట్టులోకి వచ్చి భారత్‌కు మూడో కప్పును అందించడంలో కీలకపాత్ర పోషించిన ఇషాన్ కిషన్‌కు మరో బంపరాఫర్ దక్కిం ది. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో అతడు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వెన్నుగాయం కారణం గా ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోని రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్.. కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్న తరుణంలో సన్‌రైజర్స్ తాత్కాలిక సారథిగా ఇషాన్‌ను నియమించింది.అతడికి డిప్యూటీగా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్‌గా ప్రకటించింది. కమిన్స్ ఎన్ని మ్యాచ్‌లకు దూరమవుతాడనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ అతడు ఈనెల 23న ఫ్రాంచైజీతో కలుస్తాడని జట్టు వర్గాల సమాచారం. ఇక్కడే అతడి పునరావాసం కొనసాగనున్నట్టు తెలుస్తున్నది. ఎస్ఆర్‌హెచ్ ఈనెల 28న బెంగళూరులో డిఫెండింగ్ టైటిల్ వేటను మొదలుపెట్టనున్న విషయం చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఐపీఎల్-19 ప్రారంభ మ్యాచ్‌తో తెలిసిందే.


## సన్‌రైజర్స్ మార్చి 22న ఈవెంట్ కోసం ఫ్రీ టిక్కెట్లు



ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ఒక అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. సన్‌రైజర్స్ తారలను అత్యంత దగ్గరగా కలుసుకునేందుకు 'మీట్ ద రైజర్స్' పేరుతో ఒక ప్రత్యేకమైన ఈవెంట్‌ను నిర్వాహకులు ప్లాన్ చేశారు. ఈ భారీ కార్యక్రమం మార్చి 22న హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా జరగనుంది. ఈ విషయాన్ని టీమ్ మేనేజ్మెంట్ అధికారిక సోషల్ మీడియా పేజీ ద్వారా వెల్లడించారు. ఎప్పుడూ టీవీల్లో లేదా స్టేడియం స్టాండ్స్‌లో చూసే తమ అభిమాన ఆటగాళ్లతో ముఖాముఖి మాట్లాడేందుకు ఈ మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్ ఒక అరుదైన వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నప్పటికీ, కేవలం 1000 మంది అదృష్టవంతులైన అభిమానులకు మాత్రమే ఇందులో పాల్గొనే అద్భుత అవకాశం దక్కుతుంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న మొదటి వెయ్యి మందికి ఈ ఉచిత పాస్‌లు లభిస్తాయి. ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ అంతా ఈ అద్భుత క్షణాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సన్‌రైజర్స్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో రేపు ఉదయం పోస్ట్ చేసే ప్రత్యేక లింక్‌పై క్లిక్ చేసి, యాప్‌లో సూచించిన విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి. ఇక్కడ గమనించాల్సిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఒక్కో వ్యక్తికి కేవలం ఒక టికెట్ మాత్రమే కేటాయిస్తారు. పరిమిత సంఖ్యలో పాస్‌లు అందుబాటులో ఉన్నందున, బుకింగ్ ఓపెన్ అయిన వెంటనే త్వరపడి టికెట్‌ను దక్కించుకోవాలి. మార్చి 22న జరగనున్న ఈ కార్యక్రమం అభిమానులు, ఆటగాళ్ల మధ్య బంధాన్ని మరింత దృఢం చేయనుంది. సన్‌రైజర్స్ ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించడం, వారితో సెల్ఫీలు దిగడం, పంచుకున్న మధురమైన జ్ఞాపకాలను పదిలపరుచుకునేందుకు ఫ్యాన్స్‌కు ఇదొక అద్భుత వేదిక. రాబోయే ఐపీఎల్ సీజన్ కోసం ఆరెంజ్ ఆర్మీకి మరింత జోష్ నింపేలా ఫ్రాంచైజీ ఈ ఈవెంట్‌ను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈవెంట్ జరగబోయే కచ్చితమైన వేదిక వివరాలను నిర్వాహకులు బహిర్గతం చేయలేదు. టికెట్ కన్ఫర్మ్ అయిన అభిమానులకు మాత్రమే వేదిక వివరాలను నేరుగా తెలియజేస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే డిస్ట్రిక్ట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రేపు ఉదయం 11:30 గంటలకు మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి.

## చదువును నిర్లక్ష్యం చేయొద్దు

**జీవితాంతం క్రీడల్లో కొనసాగలేం : పీవీ సింధు**



**గురుగ్రామ్**
: ఆటల మీద ఆసక్తి ఉండి దానినే కెరీర్‌గా ఎంచుకున్నప్పటికీ చదువును మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు తెలిపింది. క్రీడల్లో ఒక్క గాయంతో కెరీర్‌లు కోల్పోతాయని, కానీ చదువు మాత్రం నిత్యం మనతోనే ఉంటుందని చెప్పింది. గురుగ్రామ్‌లోని ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమె ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సింధు మాట్లాడుతూ.. 'నేను చాలాకాలంగా బ్యాడ్మింటన్ ఆడుతున్నాను. ఏదో ఒక సమయంలో మనం (క్రీడాకారులు) రిటైర్ అవ్వాల్సిందే. అది ఎవరూ కాదనలేని వాస్తవం.45, 50 ఏండ్లు వచ్చాక అత్యున్నత స్థాయిలో ఆడటం చాలా కష్టం. ఎవ్వరైనా దానిని అంగీకరించాల్సిందే. కానీ చదువు అలా కాదు. జీవితాంతం అది మనతోనే మనకు తోడుగా ఉంటుంది. క్రీడలతో పాటు విద్యాభ్యాసమూ ముఖ్యమే. నేను ఆటను కొనసాగిస్తూనే ఎంబీఏ పూర్తిచేశా. ఉదయం ట్రైనింగ్, మధ్యాహ్నం చదువు, మళ్లీ సాయంత్రం ట్రైనింగ్.. ఇది కష్టంతో కూడుకున్నదే అయినా చదువును నిర్లక్ష్యం చేయలేదు. జీవితంలో క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడం మంచి విషయమే. కానీ చదువును ఆపొద్దు. ఎందుకంటే క్రీడల్లో ఒకసారి పెద్ద గాయమైతే మన కెరీర్ ముగిసినట్టే!' అని తెలిపింది.

## బావ--మరదల ప్రేమ కథ నేపథ్యంతో తెరకెక్కుతోంది ఈ సిరీస్

కామారెడ్డి కుర్రాడు యూట్యూబ్ ఛానల్‌లో కొత్త వెబ్ సిరీస్ విడుదలకు సిద్ధం,ఉగాది పర్వదినం సందర్భంగా యువతరం నుంచి మరో సృజనాత్మక ప్రయత్నం ప్రేక్షకుల ముందుకు రానుంది. "ఇంకెన్నాళ్లు ఈ దూరం బావ" పేరుతో రూపొందుతున్న ఈ వెబ్ సిరీస్, బావ--మరదల ప్రేమ కథ నేపథ్యంతో తెరకెక్కుతోంది.షార్ట్ ఫిల్మ్స్ ద్వారా అనుభవం సంపాదించిన యువ కళాకారులు, ఈ వెబ్ సిరీస్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేనికి సిద్ధమవుతున్నారు.ఈ సిరీస్‌లో అజయ్ పిడుగు, శరణ్య రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, భాగ్య -- రామచంద్రం దర్శక నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సంవత్సరం "కామారెడ్డి కుర్రాడు" యూట్యూబ్ ఛానల్‌లో ఈ వెబ్ సిరీస్ విడుదల కానుంది. యువతరం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలని చిత్రబృందం కోరుతోంది.







## ఉస్తాద్‌పై పవన్ ఫ్యాన్స్‌లో ఉత్కంఠ

స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ ప్రస్తుతం,పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అభిమానుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పలేం. ఇటీవల విడుదలైన ట్రైలర్ కూడా ప్రేక్షకులకు ఓ మోస్తరుగా అనిపించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ట్రైలర్‌లోని కొన్ని డైలాగులపై సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోల్స్ కూడా వచ్చాయి. 'ఈ సినిమాను కాపాడేది పవనే' అన్న కామెంట్లు కూడా వినిపించాయి. అయితే ఈ విమర్శలను పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్దగా పట్టించుకోవడం లేదు. సోషల్ మీడియాలో హరీష్ శంకర్‌పై వచ్చే నెగటివ్ కామెంట్లకు వారు గట్టిగా కౌంటర్ ఇస్తూ దర్శకుడికి మద్దతుగా నిలుస్తున్నారు. ఉస్తాద్ భగత్ సింగ్' ఒక రీమేక్ అనే ప్రచారం మొదలైన సమయంలో పవన్ ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి కనిపించింది. అప్పట్లో హరీష్ శంకర్‌పై విమర్శలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారినట్లు కనిపిస్తోంది. సినిమా విడుదలకు దగ్గరపడుతున్న వేళ అభిమానులు దర్శకుడికి పూర్తి మద్దతు ఇస్తున్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా కోసం హరీష్ శంకర్ ఎన్నేళ్లుగా ఎదురుచూశాడన్న విషయం కూడా అభిమానులకు తెలిసిందే. సుమారు ఐదేళ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్ అనుకున్నప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యమైంది. మధ్యలో 'మిస్టర్ బచ్చన్' సినిమా కోసం కొంత సమయం వెచ్చించినా, మిగతా కాలం మొత్తం పవన్ సినిమా కోసం వేచి చూశారు. సినిమా ఫలితం ఎలా ఉంటుందన్నది పక్కన పెడితే, పవన్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని 'ఉస్తాద్ భగత్ సింగ్'ను తెరకెక్కించాడనే నమ్మకం ఫ్యాన్స్‌లో కనిపిస్తోంది.



## అందంతో కట్టిపడేస్తున్న లిటిల్ హార్ట్స్ బ్యూటీ.


హీరోయిన్ శివాని నాగారం గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. షార్ట్ ఫిల్మ్స్ నుంచి సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. లిటిల్ హార్ట్స్ సినిమాతో తెలుగులో పాపులర్ అయ్యింది. ఇటీవలే హే బలవంత్ సినిమాలో నటించింది .గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 2024లో నటిగా మంచి అరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలు అందుకున్నానని, 2025 నాటికి మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నానని, 2026 నాటికి పూర్తి కమర్షియల్ నటిగా మారుతున్నట్లు అనిపిస్తుందని తెలిపింది. తాను సినిమాల ఎంపికలో "క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ"కి ప్రాధాన్యత ఇస్తానని, ఎన్ని సినిమాల్లో నటించామన్నది కాదని, ఎలాంటి కంటెంట్ ఉన్న సినిమాల్లో నటించామన్నదే ముఖ్యమని నమ్ముతానని చెప్పుకొచ్చింది..అలాగే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఓ హీరో గురించి చెప్పింది. శివాని కో యాక్టర్, హీరో సుహాస్ పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'నాకు సుహాత్‌తో ఇది రెండో సినిమా. వెరీ స్పెషల్ ఈ మూవీ నాకు.. ఎందుకంటే అంబాజిపేట మ్యారేజ్ బ్యాండ్ లో సుహాస్ నాకు అన్ని విషయాల్లో చాలా సపోర్టివ్‌గా నిలిచాడు. నాకు సినిమా ఇండస్ట్రీలో చాలా సపోర్టివ్ పర్సన్ అంటే సుహాసే.అతను నాకు చాలా హెల్ప్ చేశాడు. ఇప్పుడు ఈ సినిమా నాకు చాలా చాలా స్పెషల్. సుహాస్ తో మరో సారి స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పుకొచ్చింది శివానీ. ప్రస్తుతం ఈ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.



## ట్రెండింగ్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ బ్యూటీ నయా లుక్

పవన్ కల్యాణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు.ఈ చిత్రాన్ని ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో హరీష్ శంకర్, రాశీఖన్నా అండ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. పవన్ సినిమా అంటే సెపరేట్ మాస్ డైలాగ్స్ ఉంటాయని తెలిసిందే. ప్రత్యేకించి ఉస్తాద్ భగత్ సింగ్‌లో ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం అంటూ వచ్చే డైలాగ్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. విడుదలకు ముందే సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ప్రమోషన్స్‌లో ఇదే డైలాగ్‌తో సినీ జనాల్లోకి వెళ్తోంది రాశీ ఖన్నా. ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం డైలాగ్‌తో డిజైన్ చేసిన బ్లాక్ షర్ట్ వేసుకుంది రాశీఖన్నా. షర్ట్ వెనుకవైపు రాసి ఉన్న డైలాగ్‌ను చూపిస్తున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో పార్థిబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ఆ దర్శకుడికి ఓకే చెప్పాడా?



ఏపీలో ఎన్నికల హడావిడి ముగియగానే, ముందు ఒప్పుకున్న సినిమాలన్నీ చకచకా పూర్తి చేశారు పవన్‌కల్యాణ్. ఓ స్టార్ హీరో ఎనిమిది నెలల్లో మూడు సినిమాలు విడుదల చేయడమంటే ఈ రోజుల్లో సామాన్యమైన విషయం కాదు. త్వరలో ఆయన సురేందర్‌రెడ్డి సినిమాను పట్టాలెక్కించనున్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్'కి ఇచ్చినట్టే ఈ సినిమాక్కూడా కాల్‌షీట్స్ 45 రోజులే ఇచ్చారట పవర్‌స్టార్. ఇకనుంచి ఏడాదికి రెండు సినిమాలు విడుదల చేయాలనేది పవన్‌కల్యాణ్ నిర్ణయం. అందులో భాగంగా సురేందర్‌రెడ్డి సినిమాతో పాటు మరో ప్రాజెక్టుకు కూడా లైన్‌లో పెట్టేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి పవన్‌కల్యాణ్ ఓ సినిమా చేయబోతున్నారు. తమిళ దర్శకుడు మోహన్‌రాజా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారట. ఇటీవలే ఆయన కథ కూడా వినిపించినట్టు టాక్. చిరంజీవి 'గాడ్‌ఫాదర్' సినిమాకు మోహన్‌రాజానే దర్శకుడు. అలాగే రామ్‌చరణ్ 'ధృవ'కు మాతృక అయిన 'తని ఒరువన్'కూ దర్శకుడు మోహన్‌రాజానే. స్టైలిష్ మేకర్ అనే పేరుతో పాటు.. సినిమాను వేగంగా పూర్తి చేస్తాడనే గుడ్‌విల్ కూడా మోహన్‌రాజాకు ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పవన్‌కల్యాణ్‌కు కావాల్సింది కూడా అదే. కాబట్టి ఈ సినిమా దాదాపు ఖరారైనట్టే. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com